క్లుప్తంగా

రైల్వే సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ



కుమార్‌ను సత్కరిస్తున్న రైల్వే అధికారులు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఎమ్వీఎస్సెన్ కుమార్ గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన్ను కార్యాలయ సిబ్బంది సత్కరించారు. కాగా నూతన సూపరింటెండెంట్‌గా శివయ్య బాధ్యతలు చేపట్టారు.

జిల్లాలో టీబీ తగ్గుముఖం

కోవూరు : గతంతో పోలిస్తే జిల్లాలో క్షయ(టీబీ) రేటు క్రమంగా తగ్గుముఖం పట్టిందని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ, జిల్లా లెప్రసీ– టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపాళెం పంచాయతీలో పలు ప్రాంతాలను ఆయన గురువారం పరిశీలించారు. గతంలో టీబీ సోకి ప్రస్తుతం నయమైన వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 36 గ్రామాలను పూర్తిగా టీబీ నయమైన గ్రామాలుగా గుర్తించినట్లు వివరించారు. అయినప్పటికీ ఆయా గ్రామాలను ఒకటికి రెండు పర్యాయాలు నిశితంగా పరిశీలించడమే కాకుండా గతంలో టీబీ సోకి ప్రస్తుతం పూర్తిగా నయమైనవారి యోగక్షేమాలు తెలుసుకుంటున్నామన్నారు. కోవూరు మండలంలో పోతిరెడ్డిపాళెం, లేగుంటపాడు, మోడేగుంటలను క్షయ రహిత గ్రామాలుగా గుర్తించినట్లు తెలిపారు. టీబీ వ్యాధిగ్రస్తులకు బలవర్ధకమైన పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదలకూరులో రెండు పరీక్ష కేంద్రాలు

పొదలకూరు : ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కాకతీయ జూనియర్ ప్రైవేటు కాలేజీలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కాలేజీలో 263 మంది, ప్రైవేటు కాలేజీలో 191 విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. విద్యార్థుల సంఖ్యకు అనువుగా బెంచీలను ఏర్పాటు చేసి గాలి, లైటింగ్ తగిలే విధంగా కిటికీలు ఉండేలా రూమ్‌లను ఎంపిక చేశారు. పరీక్షల కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు వెల్లడించారు.

ఎన్‌ఎస్‌ఎస్ సేవలు అభినందనీయం

ముత్తుకూరు : మండలంలోని తాళ్లపూడి గ్రామంలో వారం రోజుల పాటు మత్స్యకళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలు అభినందనీయమని సర్పంచ్ మెట్టా వింధ్యరెడ్డి కొనియాడారు. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమం చివరి రోజు సందర్భంగా గురువారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. మత్స్యకళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్ ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల నిర్వహణకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం మొక్కలు నాటారు. కో–ఆర్డినేటర్ డాక్టర్ ధనపాల్, విస్తరణాధికారి డాక్టర్ మాధవన్, ఉపసర్పంచ్ గోపాల్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు త్రివేణి, శ్రీవిద్య పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకూ సాగునీరు

మనుబోలు : ఈ ఏడాది చిట్టచివరి ఆయకట్టు రైతులకు కూడా సాగునీరు అందించామని ఇరిగేషన్ డీఈ గురజాల అన్నారు. మండలంలోని జట్లకొండూరు పంచాయతీ పరిధిలో ఉన్న చెరువులను ఆయన గురువారం పరిశీలించారు. కనుపూరు కాలువ ఆయకట్టు పరిధిలోని నిడిగుంట, కోనేటమ్మ, కొండూరమ్మ, పెట్లగుంట, పాకాల, కుడితిపల్లి చెరువుల ద్వారా సాగునీరు అందుతున్న వైనం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం మాట్లాడుతూ మంత్రి కాకాణి చొరవతో తమ గ్రామ పంచాయతీ పరిధిలో పొలాలన్నింటికీ ఈ ఏడాది సమృద్ధిగా సాగునీరు అందుతోందన్నారు. రైతుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. వారి వెంట ఇరిగేషన్ ఏఈ వెంకటరమణయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు రమేష్, జగదీష్, రాజారెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, సురేష్, కిరణ్, నాగరాజు, మోహన్ తదితరులు ఉన్నారు.

కౌన్సిల్‌లో పలు అంశాలు ఆమోదం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమావేశంలో వివిధ పనులకు సంబంధించి 22 అంశాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అన్ని అంశాలను కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారని వివరించారు. సమావేశంలో కమిషనర్ రమణబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల క్లెయిమ్‌లను పరిష్కరించండి



మాట్లాడుతున్న హరినారాయణన్

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఓటర్ల జాబితాకు సంబంధించిన ఫిర్యాదులు, క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ హరినారాయయన్ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 23 నుంచి ఫిబ్రవరి 29 వరకు ఫారం – 6 క్లెయిమ్‌లు.. అభ్యంతరాలను 10,591.. ఫారం – 7లను 3519.. ఫారం – 8లను 9737 మేర ఆమోదించామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న వాటిని పరిశీలించి తగు చర్యలు చేపడతామని వివరించారు. జిల్లాలో 19,21,111 మంది ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. మరణించిన ఓటర్ల తొలగింపు అంశాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించగా.. డెత్ సర్టిఫికెట్‌తో పాటు కుటుంబసభ్యులు లిఖితపూర్వకంగా ఇస్తే తగు చర్యలు చేపడతామని తెలిపారు. డీఆర్వో లవన్న, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మురళీధర్‌రెడ్డి, సీ నారాయణ, టీడీపీకి చెందిన భువనేశ్వరిప్రసాద్, హరికృష్ణ, రసూల్, సురేంద్రబాబు, బీఎస్పీ నుంచి శ్రీరామ్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్లో తనిఖీ



నెల్లూరు(సెంట్రల్): నగరంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో గల ఈవీఎం, వీవీప్యాట్ గోడౌన్‌ను కలెక్టర్ హరినారాయణన్ గురువారం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం నెలవారి తనిఖీల్లో భాగంగా కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్డీఓ మలోల, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను విధిగా పెంచాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు(సెంట్రల్): ప్రతి ఇంటా మొక్కలను విధిగా పెంచాలని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ధనలక్ష్మీపురంలో కాటంరెడ్డి రమణారెడ్డి, సరస్వతమ్మ పేరిట కుమారులు మధుసూదన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీ గురువారం ప్రారంభించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మేయర్ స్రవంతి, నూనె మల్లికార్జున్, మల్లు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ హాల్లో ఏర్పాట్ల పరిశీలన



నెల్లూరు(బారకాసు): కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో నెల్లూరు నగర అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ ఏర్పాటు అవకాశాలను రిటర్నింగ్ అధికారి, కమిషనర్ వికాస్ మర్మత్ గురువారం పరిశీలించారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపర్చడం, ఓట్ల లెక్కింపు, ఫలితాలను వెల్లడించేందుకు గానూ కళాశాల భవనంలోని సౌకర్యాలను పూర్తి స్థాయిలో పరిశీలించారు. అనంతరం వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు. డీఆర్వో లవన్న, ఆర్డీఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

సీఐఎఫ్‌ఏ తీర్మానాల ఆమోదానికి వినతి

నెల్లూరు(దర్గామిట్ట): వ్యవసాయ రంగ బలోపేతానికి గానూ కన్సార్షియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ (సీఐఎఫ్‌ఏ) తీర్మానాలను రాష్ట్రపతి ఆమోదించాలని ఏపీ రైతు సంఘ అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్రపతికి రాసిన లేఖను కలెక్టరేట్లో ఏఓ మధుసూదనశర్మకు గురువారం అందజేశారు. ఏవీఆర్ నాయుడు, మాలకొండారెడ్డి, శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం రేపు

నెల్లూరు (టౌన్): వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని అంబేడ్కర్ భవన్‌లో శనివారం నిర్వహించనున్నామని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని కెనరా బ్యాంక్ సహకారంతో గురువారం నిర్వహించారు. ఆర్థిక అవగాహనకు రిజర్వ్ బ్యాంక్ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఆర్‌బీఐ రూపొందించిన క్రాస్ పజిల్ ఆధారిత పరీక్షను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.నాలుగు వేలు, రూ.మూడు వేలు, రూ.రెండు వేలను అందజేశారు. లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ప్రదీప్‌కుమార్, నాబార్డు మేనేజర్లు రవిసింగ్, సాయికిరణ్, ప్రిన్సిపల్ గిరి, అధ్యాపకులు చెంచురామయ్య, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పల్లకిసేవ



నెల్లూరు(బృందావనం): సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అభిషేక, సహస్రనామ పూజలు, అర్చనలను ఆలయ ప్రధానార్చకుడు రామావఝుల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో జరిపారు. పల్లకిసేవను వేడుకగా నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి నృత్యనికేతన్‌కు చెందిన నాట్యాచార్యులు వేదాంతం పూర్ణచంద్రరావు శిష్య బృంద ఆధ్వర్యంలో చేపట్టిన కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. ఉభయకర్తలుగా వాయుగుండ్ల వెంకటసుదర్శన్‌రావు దంపతులు వ్యవహరించారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్తలు బాలాజీసింగ్, ధర్మసింగ్, ఈఓ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించరూ..



భవన నిర్మాణ కార్మికుల నిరసన

నెల్లూరు(దర్గామిట్ట): భవన కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి ముక్తియార్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్ కార్యాలయ ఎదుట నిరసన కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 40 వేల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు, జిలానీఖాన్, వనజమ్మ, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



నెల్లూరు(సెంట్రల్): రూరల్ పరిధిలోని పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి నగరంలోని తన నివాసంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.5.7 లక్షల మేర చెక్కులను బాధితులకు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదాలను గెలిపించుకుందాం



నెల్లూరు(బారకాసు): రానున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని 21వ డివిజన్ జేసీఎస్ ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ నేతలతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని గురువారం నిర్వహించారు.

• 32వ డివిజన్లోని ఎస్టీటీ కాలనీలో ఎన్నికల ప్రచారాన్ని కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్ నిర్వహించారు. నేతలు రజాక్, రెహ్మాన్, రియాజ్, గౌస్‌బాషా, ముజఫర్, సర్దార్, హఫీజ్, జావీద్, రిజ్వానా, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార పాట సీడీల ఆవిష్కరణ



నెల్లూరు(సెంట్రల్): ఎన్నికల ప్రచారానికి రూపొందించిన పాట సీడీలను ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. నగరంలోని ఎంపీ నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శివలీలా తరంగిణి సప్తాహం

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రిని పురస్కరించుకొని శివలీలా తరంగిణి సప్తాహాన్ని శుక్రవారం నుంచి ఈ నెల ఏడు వరకు నిర్వహించనున్నామని పద్యసారస్వత పరిషత్ సంస్థ అధ్యక్షుడు లక్ష్మీనరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి మందిరం, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథస్వామి దేవస్థానంలో రోజూ సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. భక్తులు తరలిరావాలని కోరారు.

చిత్ర పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(మినీబైపాస్): ఈ నెల ఏడున విడుదల కానున్న మైండ్ గేమ్ చిత్ర పోస్టర్లను నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆవిష్కరించారు. చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



నెల్లూరు(పొగతోట): జెడ్పీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసులురెడ్డి గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన సభలో ఆయన్ను సత్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ కన్నమనాయుడు, డిప్యూటీ సీఈఓ చిరంజీవి, అసోసియేషన్ నేతలు పెంచలయ్య, రమేష్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

శేషజీవితాన్ని హాయిగా గడపాలి

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



సత్కారం పొందిన అధికారులతో తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు (క్రైమ్): ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులు తమ శేషజీవితాన్ని హాయిగా గడపాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన సీఐ కృష్ణానందం, సౌత్ ట్రాఫిక్ ఏఎస్సై ప్రభాకర్‌కు ఆత్మీయ వీడ్కోలు సభను నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో గురువారం నిర్వహించారు. వీరిని సత్కరించిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. ఆయురారోగ్యాలు, కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని కాంక్షించారు. ఏఎస్పీ (అడ్మిన్) సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

తూ.కొ. అధికారుల దాడులు



నెల్లూరు(అర్బన్): నగరంలోని పలు దుకాణాలపై ఆకస్మిక దాడులను తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. ఆ శాఖ కంట్రోలర్ ఆదేశాల మేరకు ఒంగోలు, బాపట్ల, నెల్లూరు అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలను నిర్వహించారు. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని పలు బియ్యం దుకాణాలతో పాటు కూల్‌డ్రింక్స్, ఐరన్ షాపులపై దాడులు నిర్వహించి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. నికర తూకం కన్నా తక్కువగా బియ్యం బస్తాలను విక్రయిస్తున్న వారిపై ఏడు.. ఆత్మకూరు బస్టాండ్‌లో అధిక ధరలకు కూల్‌డ్రింక్స్‌ను విక్రయిస్తున్న వారిపై ఆరు.. ఐరన్ షాపుల్లో మోసాలకు పాల్పడిన వారిపై మూడు.. ఇతరత్రా రెండు కేసులను నమోదు చేశారు. డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్, అసిస్టెంట్ కంట్రోలర్ ఈశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



నెల్లూరు(పొగతోట): ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన బండారుపల్లి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ ఎన్జీఓ రాష్ట్ర కార్యవర్గంలో ఖాళీ అయిన పోస్టులకు అభ్యర్థులను విజయవాడలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకత్వానికి పలువురు కృతజ్ఞతలను తెలియజేశారు.

నూతన భవనంలోకి బ్యాంక్ ఆఫ్ బరోడా



నెల్లూరు(సెంట్రల్): బృందావనంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖను చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని నూతన భవనంలోకి మార్చామని హైదరాబాద్ జోనల్ మేనేజర్ రితేష్‌కుమార్ పేర్కొన్నారు. కార్యాలయాన్ని గురువారం ప్రారంభించిన అనంతరం రితేష్‌కుమార్, రీజినల్ మేనేజర్ శేషగిరి మాట్లాడారు. ఖాతాదారులకు మెరుగైన సేవలను తమ బ్యాంక్ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. అన్ని రకాల రుణాలను అందిస్తున్నమని తెలిపారు. మేనేజర్ చెన్నాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలను గురువారం చేపట్టారు. నగరంలోని యనమలపాళెం, రూరల్ పరిధిలోని సౌత్‌ఆములూరు, తోటపల్లిగూడూరు, తుమ్మలపెంటలో జిల్లా విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలను నిర్వహించారు. మీటర్ ట్యాంపరింగ్.. బైపాస్ పద్ధతి ద్వారా స్తంభం నుంచి విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తుండటాన్ని గుర్తించారు. 15 కేసులు నమోదు చేసి రూ.మూడు లక్షల అపరాధ రుసుమును విధించారు. విజిలెన్స్ ఎస్సై పుల్లారెడ్డి, ఈస్ట్ – 1 సెక్షన్ ఏఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ ద్వారా సబ్సిడీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ యోజన ద్వారా అధిక సబ్సిడీని పొందవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. గృహాలకు విద్యుత్ వినియోగం సరాసరి నెలకు 150 యూనిట్లు ఉన్న వారు ఈ పథకం ద్వారా రెండు కిలోవాట్ల సోలార్ టాప్ ప్లాంట్‌ను పెట్టుకోవచ్చని తెలిపారు. దీనికి రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు సబ్సిడీని అందజేయనున్నారని చెప్పారు. 150 నుంచి 300 యూనిట్లను వినియోగించుకునే వారు రెండు నుంచి మూడు కిలోవాట్ల సోలార్ రూఫ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకునేందుకు రూ.60 వేల నుంచి రూ.78 వేల సబ్సిడీని పొందవచ్చని పేర్కొన్నారు. సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకునేందుకు మిద్దెపై 10 చదరపు మీటర్ల విస్తీర్ణం ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

లీప్ డే బేబీలు..



పురిటి బిడ్డతో అల్లూరు మండలం ఇస్కపల్లికి చెందిన వాణి

నెల్లూరు(అర్బన్): సాధారణంగా తమ జన్మదిన వేడుకలను ఏటా జరుపుకొనే అవకాశం ఎక్కువ మందికి లభిస్తుంది. అయితే లీప్ ఇయర్‌లో ఫిబ్రవరి 29న జన్మించే వారికి మాత్రం ఈ అవకాశం నాలుగేళ్లలో ఒక్కసారే వస్తుంది. ఇలా లీప్ డే గురువారం నాడు పెద్దాస్పత్రిలో 8 మందికి తల్లులు జన్మనిచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కలిపి సాయంత్రానికి 100 మందికి పైగా పురుడు పోసుకున్నారని తెలుస్తోంది.